
ఓం శ్రీ సాయిరాం

స్థితి పటలం

ఓం శ్రీ పరమాత్మనే నమః



సాయి శివహరి ఓం

శ్రీసాయి సుదర్శన గీత

## దశమ అధ్యాయము — సోమయాగ విభూతి యోగము

### (1) (22-10; యాభైనాలుగవ రోజు)

| | |
|---|---|
| 1. | ఇచ్చుటకు నేనుండ వచ్చుటకేమి నిచ్చగించవే కారణమేమి ఖర్మము కప్పురమై కరగ స్వామిని కనుమా....! |
| 2. | మతమును గలుపు మంట ! కులమును తొక్కు కుతక బంట !!<br>మమత మానవతా సమాఖ్యతల సచ్చిదానంద మూర్తి సాయిని నేను....! |

### (2) (23-10; యాభైఐదవ రోజు)

| | |
|---|---|
| 3. | ఇంతలు కన్నులుండి బ్రతుకుల వింతలు చూసెద వేటికి నీ చింతలు బాప చెంతగనున్న<br>శ్రీకాంతుని కనగలేని కనుగవలా! కావే అవి నీరులేని నూతుల్ గావా....! |
| 4. | ఎంతటి మేధస్సుండిన నీ వింతటి  మూఢమతివై ముష్కరులన్ చేరి దుష్కృత్యముల్ దురత దుఖాంబోదుల్<br>అవురా! సృష్టించుకొందువు నీ మేధకు నిదిపదునా ! అది చెత్తకుప్పపై వేసిన పేడకడిం గాదే<br>పేడకడి కన్నా పది వీశముల్ తక్కువగాదే....! |

| | |
|---|---|
| 5. | నీ మేధ, సుమేధ సమయోచిత సద్గుణ వల్లరివై నీ అల్లరి పనులు మాని విశ్వ మోహనున్ పిల్లన్ గ్రోవి విని<br>సేయవే పీయూష పానముల్ పో ఆనాడే నీ మతి సమతా కుమతివి ఏల అవుదువే....! |
| 6. | బుద్ధులు చెప్పెద ననుచు బుడి బుడి రాగాల నేల నీ రోగాల మాన్ప మందున్నదిలే..<br>విందులు ఎక్కువై పసందైన నీ జీవితమునకు విరుగుడు విషమును తలపింపు,<br>అరకలు వేసి నీ జిహ్వ సరగునన్ శ్రీ రామ నామం జపింప జేయునే....! |
| 7. | తనివి తీరని నా తారక మంత్రము తరుణోపాయం చెప్పకనే చెప్పున్<br>చెప్పిన చెప్పక, చెప్పిన నీతి చెప్పక  నే చెప్పిన నీతులు, మరి నే చెప్ప....! |
| 8. | చెవిటికి శంఖం ఊదిన పగిది అవురా నా నీతుల్ నీకు చెఱకు లాయెనా ! ఇక్షురస పానముల్,<br>హరి నామ గాన కథామృతముల్ హర హరము  నీకేటి జెప్ప, నీవొక ఖరమున్ గాదే....! |
| 9. | కరము లేటికి నీకు శ్రీకాంతు కరమెత్తి ప్రణామంబు చేయనే ..కరములు కావవి, నెండిన కట్టెలే గాని<br>పురుషోత్తముని చేరని నీ పుట్టుకేపాటి పుడమిన జేరబడె.. పాపికి ఈ పాటు..? |
| 10. | పరమ పదముల్ జేరని, బ్రతుకు లేపాటి..ఎంగిలి మెతుకులకై కాకులకు సాటి మీబోటి, మీపాటి,<br>ఏపాటి బ్రతుకుల్ అడుగు అడుగున నన్ను ఇక అడిగినా కాని నా అడుగు అరంగుళమైన నీ కంద నివ్వ....! |
| 11. | అర్థంబు చెప్పినా వ్యర్థంబు చేసేటి మీ జీవితాల అడ్డంబు ఈ పాటి బ్రతుకు మూణ్ణాళ్ళే..మురిపాలు, ముచ్చట్లు<br>ఆ పైన మిగిలేది పిడికెడు బూడిదే గాని: మిగులు బూడిద తప్ప, చిగురేది బ్రతుకుకు...! |
| 12. | మొదలేది ! తుది ఏది? చెప్పింది చెప్పి, నీకు పుట్టిన బుద్ధి పుడకల నాడే పోదు, పోదు పోలేదు గూడ<br>ఆనాడు అరచిన, గొంతెత్తి పిలిచినా నీ పాప కర్మాల ఏ లోకాల పడి నేడ్వ<br>నే పలక నయ్య, నీ రాత తుడువ నా చేతగాదు....! |
| 13. | పుట్టిననాడే ఏనాడో చత్తువని తెలుసు .. కాల ధర్మంబిది కాలచక్రము ఆగక తిరుగుతు నుండ<br>ఏనాడో ఉన్నావు - ఏనాడో పోతావు ఈనాడు ఉన్నావు — మరునాడు ఉండనే పోవు....! |
| 14. | కాలచక్రము క్రింద నలిగేటి నీ బ్రతుకు.. కర్మముల, ధర్మముల కరిగేటి నీ బ్రతుకు.. ఏ కథల్ చెప్పినా,<br>ఏ కావ్యమిప్పినా, వేదాలుతెలిసినా, ఎన్ని జన్మలెత్తినా, ఏ రాత విన్నా, ఏ గీత విన్నా.. మిగిలేది బూడిదని,<br>మరి చెప్పుచున్న ధర్మాల నడిపింప ఖర్మాల కరిగింప జీవితం వ్యర్థము పోక అర్థంబునే చెప్పి నిలిచిస్తి విభూతి |
| 15. | విభూతి అన బూడిదే గాదు .. రగిలించి చితిలో నది మిగిలిన చితా భస్మమే గాదు .. మధ్య వచ్చు<br>సిరులన్ని- మధ్యలోనే  పోవ మిగిలేది బూడిదని మీకు చెప్పక చెప్పి  నేనిచ్చిన విభూతి చెప్పు నీ అర్థం....! |
| 16. | పంచ భూతములమా నేర్పడిన పాంచ భౌతికం .. శరీర ధారులై జనించు మరణించ<br>పంచభూతాల లయించు నీదు ప్రాణాలు - మధ్య మిగులు కాలం, అజ్ఞాన గాఢాంధకారం....! |
| 17. | మాయ పొరలలో, మర్మంబు తెలియక .. నిత్యమౌ, నిలుచునని కమ్మేటి కలలు<br>కదిలించి, కబళించి, నుసిచేసి, మసిచేసి మిగులునది విభూది....! |

| | |
|---|---|
| 18. | కాసులెంతైన కష్టించి కట్టిన మూటలు.. కాసంతైన రావన్న నీవెంట ... పతి, సతి, సుతుల్, బాంధవుల్, సఖుల్, శత్రువుల్, తల్లుల్, తండ్రుల్, తాతల్ ఏరి నీవెంట నెవరు రారు. మున్ముందు తరాల, ముందు తరాల గడచిన శతాబ్ద గతాబ్దిన్, నేరి, వారేరి? ఈ పోకడన్ పోయిన వారు కారే....! |
| 19. | ఏది మీ వెంట ఎవరు, వీసమైన నెత్తుకు పోయిరే .. ఈ చరిత్ర పునరావృత్త నిర్వివాదాంశము పురుషోత్తముడనై నిన్ను పుణ్యంబునన్ నడప... నొక్కి వక్కాణించి, చెప్పిన సాయిగీతానుసారం...! |
| 20. | నీ వీనుల విందుగా విని తరించు భవ తరుణోపాయం తరచి చెప్పితిన్ తప్పులను విన్నాక ఈ గీతానుసారం పానంబు సేయవే నందెదవు పరమ కైవల్య పదము...! |

(3) (24-10; యాభైఆరవ రోజు)

| | |
|---|---|
| 21. | ఎంతని చెప్పుదును ఈ గీతోపచారం ..చేసెద వన్న విని పరుల కపచారం చెప్పుటకేమున్నది ఆనాటి కృష్ణపరమాత్మునినే..! ఏడేడి నా చిన్ని శిష్యుడు ఆత్మీయ బాంధవుడు — అర్జునుడు కాగడా బెట్టి వెదికినన్ కానరాడే నంతటి శిష్యుడు నవురా మీరంతా! కండ్ల పొరలు కమ్మిన నిషార్జునుల్...! |
| 22. | పత్రమో, పుష్పమో, ఫలమో, భక్తితో భగవదర్పితం చేసినన్ చాలంటిని నాటి శిష్యునితో..నా వాక్యమే నేడు అపవాక్యమై నిత్తురే పిచ్చి, కూరల్ పచ్చి, దుంపల్..ఇదేమి చిత్రమో ఇది వదలుటకు నదా ఆ గంగ సాక్ష్యమై ఓయి నీ బుద్ధి నింత వ్రయ్యలై పోయె నిండు భక్తితో నీమది నర్పించినన్ చాలదా కోతికి కొబ్బరికాయలా నీ వేటికి చేసెదవో నీతి తప్పిన పనుల్..ఎంతని ఉపదేశిస్తు నీ వింతై అంతై కోతి పనుల్ సేయ, అవురా! నా శిష్యులు నేటి విషార్జునుల్....! |
| 23. | పండ్లికిలించక చేయక మరి పాడు పనుల్ ఓరన్నా! ఏనాడన్న ఉన్నావా పది క్షణముల్ పావనమతివై, పలుక నే పల్కనా సాయి పరమాత్మనై ఆనాడే చెప్పిన గీత యినాడు రాసిన ఈ రాత కాదా, నొకటి కాదా, కాదు నీ చేత కాదని చెప్పేటి నేటి శిష్యుల్ నిషార్జునుల్....! |
| 24. | భక్తి పారవశ్యంబున కనుల అర మూతలై విన్న ఆనాటి నా శిష్యుడు నా ప్రియతముడు, నయంబునన్ చెప్పినన్ అరచినన్ భయంబునన్, నే గీచిన గీత దాట నన్నాడే నొక మాటే ఆ నోట<br>ఏరిరా! ఆ ప్రియతమ శిష్యుడెక్కడ నా వీరార్జునుల్ నెక్కడ, లేరే వారసుల్ నిషా నిండిన నీదు కళ్ళల్లో కమ్మ కాంక్షల్ నీ కన్నులన్ కాన్పించునే నిషార్జునుల్....! |
| 25. | అంతటి వీరుడు ఆనాడంతటి ఘనుడు సర్వంబున్ నను నమ్మి నా చేతన బెట్ట జీవిత మంతను రథచోదకుండనై నడిపింప నా చేతకు నోరెత్తక నమ్మెనే ఏడిరా అలాటి మేటి ఆ శిష్యుడు లాంటి వారెవరైనా ఎదురై అర్థించినన్ ఇవ్వక పోదునే ఆత్మ సాక్షాత్కారము....! |
| 26. | నడిపింపక బోదునా నీ జీవిత సారథినై అడుగడుగున అనుమానముల్ మీరే మీకై, మీకేది వాంఛితములో తెలియని భక్తులా? వీరులా? భోగులా? యోగులా ఎవరురా? ఎవరని నమ్మి మీకీత్తు నాత్మ సాక్షాత్కారం |

| | |
|---|---|
| | గీతా భోదానుసారములో ఇచ్చలు నిండిన మీ కండ్లు కాన్పింపరే నిషార్జునుల్....! |
| 27. | అరచితినని అలుగుటేల నీ మనసారా పిలిచినన్ పలుకు చుంటిగా<br>నన్నరయ లేదని మనసున నగ్గి మండ విభూతై నిత్తు సత్తు చిత్తు....! |
| 28. | అద్వైనా అరియించుకోలేని అర్భకా నా శిష్యా! నే వేదన నెంతని పడుదు వింతలు కాదే<br>నిది నే చెప్పిన మాటల్ పేడ చెవిన పెట్టిన తిట్టక ముద్దెట్టు కొందునా....! |
| 29. | మురిపం మీరగ శిష్యా రారా! తట్టల కొద్దీ నీకిత్తు బ్రహ్మజ్ఞానం బ్రతిమాలి పిలిచినన్ నేల పారిపోయెదవు!<br>బడుగు బ్రతుకులు — ఔరా, ఏనాడైనన్ బాగుపడున్ కన్పింపరే ఆనాటి వీరార్జునుల్, నా కళ్ళకు కాన్పించిన నిషార్జునుల్....! |
| 30. | నిక్కముగ నిజము చెప్పెద చక్కంగా మదిని నమ్మి చేయుదువంటే పక్వంగా పది ముక్కలు చెప్పెద<br>వినుకో అన్నా మాయన్ ఛేదించు.. మది నమ్మిన మాయన్ ఛేదించు.. ఛేదించకున్న అజ్ఞానమున్<br>దాటగలేవు ఇంతై అది నింతై భువన భువనంతరమై....! |
| 31. | అహంకారం ఆవిర్భవించి నువ్వు నేనను భేద భావము బుట్టు చీల్చుచెండాడు నీ దరికిన్ జేరనీక<br>సర్వ కాలాలకున్ అన్నా.... అది చేటు గదన్నా.... ఆ మాటున మున్న నన్ను కనుగొన లేవు....! |
| 32. | చీల్చిము మాయను పేల్చుము అజ్ఞానమున్ విడుచుము, విడుచుము నహంకారము<br>నాడే కలుగు నాదు సాక్షాత్కారమున్ అన్నన్నా కన్పించునే అప్పుడు భక్తార్జునుల్....! |
| 33. | నాది, నాదని.. నేను, నేనని మమతను వీడుము సమతావర్తివైన సర్వజీవులలో నను కనుగొన గలవు<br>మమతను మంచిని పంచుము..పది మందికై సమతన్ నిల్పుము సమస్తమున్ నిల్చును సర్వేజన<br>సుఖినోభవంతు....! |
| 34. | శిష్యా! ప్రేమగా నిను పిలిచి నేర్పితి నీతులన్ని భక్తా! బ్రతిమాలితి మరికొన్ని సార్లు సఖుడా అని సారె సారెకు<br>కోరితి నీ సఖ్యత సాయి అన్న పలికి, స్వామి అన్న వచ్చి అర్థించినన్ నీ ఆర్తిని దీర్చితి....! |
| 35. | మీ భయంబులు బాప నే నభయంబు సూపితి మమతను పంచితి సాయి మాతై  పిలిచితి దరికి,<br>కట కట మీ కష్టముల్ నా మనసు చిటపట పడె అలమట చెందితి, అన్ని రూపములై నిన్నర్థించితిన్....! |
| 36. | రయమున రమ్ము నీ నిడుముల బాప నీకై ద్వారక ద్వారముల్ తెరిచి యుంచితిన్<br>చిడు ముడి పాటేటికి బుడి బుడి నడకల తప్పటడుగుల్ వేయుచు వచ్చు పసికూనలారా....! |
| 37. | నా కంటికి దోచుటే గాదు, గారాబము సేతు....! మీరు వేయు తప్పటడుగు తప్పులు గాదు<br>అడుగు తప్పి వేసిన, తప్పించుకో జూసిన నాకవి తప్పేవే కాదు ముద్దున్ రాగ చంక నెక్క సమయంబిదే<br>నీ వెంతటి మొనగాడవైనన్ నాకు ముద్దు కూనలే దరి జేరుడు.... ద్వారక దారే తెలియ లేదా....! |

(4) (25-10; యాభై ఏడవ రోజు)

| | |
|---|---|
| 38. | పుట్టిన నాటి నుండి చెట్టుకు పోసిన పగిది నీతుల్ నీరు పోసితిన్! నీ పుట్టుక నీకే తెలియదు, పుట్టుకయే లేని నను పట్టగ పట్టు పడెదనా..? |
| 39. | నిను పుట్టించిన ధాతకు విధాతన్ : మిక్కుట మైన నీ తెలివి మింగుడు పడన్, నీ గొంతుక హరి నామ గానమున్ పానము సేయగ వచ్చునే..! అద్యంతమైన నాదు పాదముల్ అందుకొనంగ అర్థించుటే నీకు ఒప్పు, నా పుట్టుకలన్ పట్టంగ నేర్తువే! పది పది జన్మలకైనన్ పుట్టంగతులు నీకు పుట్టనున్నదే..? |
| 40. | అ, ఆ లు నాటి నుంచి 'క్ష'వరకు అందించిన ఆది మధ్యాంత రహితున్ నాదగు లీలలు — ఏ లీలన్ అందగ లేవు నీ అజ్ఞానపు గోలల — కుడితిన పడ్డ ఎలుకవై కొట్టు మిట్టాడు బ్రతుకున పట్టంగ నను నేర్తువే...! |
| 41. | కనకపు సింహాసనముల్ నవ రత్న, ఖచిత కిరీటముల్, కాన్కల్ నిచ్చిన నే మింటి నుండో దిగి వచ్చి సాక్షాత్కార మిత్తునని మాయన్ నీ వందితివి, నే ఈ లీల, నీ మాయన్ నేను బడ బోదునా! పోకిరివి గాక బుద్ధిగ నా పాదముల్ పట్టినన్ నీ మనంబు.... తట్టి పిడికెడు ప్రేమన్ పంచినన్, ఎంచి నీ ముంగిటి కొత్తు, మాయ కమ్మిన నీ కన్నుల విప్పెద వేని....! |
| 42. | నీవిచ్చు రూకలకున్ నారాక — ఈ పోక నడవదు ఏ నాటికిన్ విధి చేతి కీలు బొమ్మలు నా విభూతి యోగముల్ నందగ లేరు....! |
| 43. | పొందంగ సుమేధ జ్ఞాన విజ్ఞాన యోగముల్ దైవ సంయోగ బల మున్నచో చేధించ గలరు మాయను, ఈ లీలన్ లీలా మానుష విగ్రహంబు నేనై మీ నిగ్రహంబులన్ కనుగొన దాగితి, నందాక నందంగ లేవు ఈ నంద నందున్....! |
| 44. | నన్నందంగ నీ డెందము కోర్కెను కోరిన నీ కామితముల్ కట్టం గట్టి అజ్ఞానమున్ విజ్ఞాన జ్యోతులు నడ్డం బెట్ట గాఢాంధకారం నైన తటిల్లతనై నీ మేనున్ తట్టి, నీ మనమును తట్టి, నీ భవబంధములను పట్టి నట్టేటన్ నున్నన్ నావిక నడిపింతు, నంద గోపకుల నందనుండనై....! |
| 45. | నన్నందంగ జాతువేని అడ్డ దారులేల నీ అన్వేషణ ఎందెందో చేయంగ నేల? పొందు కోరితివేని — కామ, క్రోధ, మద, మోహ, లోభములు మదమును కట్టు — నది నావలి గట్టు ఆపై మెట్టు — మదన మోహనుడు నీ సొత్తే....! |
| 46. | ఎందెందు లేను నేను అందందే కలను కాన విజ్ఞాన నేత్రములుంటే ముదమున చెప్పెద మదిన పెట్టు నాదగు లీలా మానుష రూపంబుల్.....! |
| 47. | పుట్టుక లేని వాడిని మీ పుట్టుకకు కారణభూతుడైన వానిని పట్టంగ నేర్తువే? నా ఆనతి లేక, నీ వీపు వాయం గొట్టంగలను భక్తిన్ పిలు నీ బంటునై నే అర్థింతు నీ ఆజ్ఞలన్..! |
| 48. | వెన్నలు దిన్న వాడ — వెన్నుడనై గావగ నున్న వాడ..మీ మాయలన్ చేదించగన్ మురళిన్ జ్ఞాన రవముల్ రవళించుచున్నవాడ మీ ముద్దుంకృష్ణుండ — నా సుద్దులు విన్న చద్దెన్నపు మూటలై |

| | |
|---|---|
| | భువిన్ బృందారక వనము జేర్తు — నందార్చిత నందనుండ....! |
| 49. | మీ రానంద మూర్తులవుతు పరమానంద....నంద నందున్ నందురు గాక భక్తి భావంబునన్ పిలవ<br>భువినంత భగవంత రూపమై భాసిల్లు....! |
| 50. | సూర్య, చంద్రుల నేను దీప, దీపికల నఖండ దీపమై భువినంత వెలిగించు బ్రహ్మాండ జ్యోతిలో నేనే<br>త్రిమూర్తులను నేను, అష్టవసువులను నేను, సనక సనందాది ఋషులన్ నేనే.. దేవతల నేను ఇతర దేవుళ్ళ నేను..<br>తరువుల, గిరులన్, సురులన్, యక్ష, గంధర్వులన్, రాక్షస, కిన్నెర, కింపురుష, సిద్ధ, సాధ్య, సిద్ధులన్ నేనే.! |
| 51. | నాదగు అవతారముల్..అరయంగ ఎన్నెన్నో సాగరంబుల నేనే..నదీ, నదంబుల నేనే, సురపతిని నేనే<br>నరపతియు నేనే....! |
| 52. | అగ్నిన్, అంబోధిన్, తారా మండలంబునన్, రేయింబగళ్ల, లోక లోకాలన్, ఆకసంబున్, బ్రహ్మలోకంబున్,<br>గోవులన్, బాహులన్, కుంటలన్, మంటలన్.. వెయ్యి వెయ్యి వెయ్యి వేల వేలాది వేల నా రూపములు ఏ<br>లీల గణించ? వెయ్యి, వెయ్యి, వెయ్యి నీ గణితాల్ వెయ్యి వేల, వేలాది కోట్లాది, కోట్ల, కోట్ల రూపాల,<br>లెక్కించ గలవేమో? |
| 53. | వెయ్యి, వెయ్యి గుణముల వేలాది గుణముల వెయ్యి వేయి వెయ్యి కోట్ల గణముల ప్రమధ గణాల వేయి,<br>వేయి, వేయి కోట్ల నాదగు గుణ గణాలు వేతువో, రాతువో, చూతువో? ఏదేది?<br>నీ దగు విజ్ఞాన లెక్క లేసెడి పెట్టె...! |
| 54. | వెయ్యి, వెయ్యి, వేలాది వేల, వేలాది నుదుట నే గీసిన రాతలున్, చేతలున్ నే రీతి నా రాత నే చోట ఏ<br>నోట ఏ లీల నా లీల పలికింతు వినిపింతు నడిపింతు...! |
| 55. | వెయ్యి వెయ్యి వెయ్యేసి గుణముల గుణ గణాల, గణ గణాల, రూప రూపాల ..నేక రూపంబునై,<br>నిర్గుణుండనై నిశ్చల తత్వమున్ నొక్క రూపంబునై నిరాకారుండనై, నిర్మోహుండనై చిదానందుడనై —<br>సదానంద మూర్తినై మూర్తులకు మూర్తవుదు...! |
| 56. | పెక్కు మూర్తుల అవతారం నెత్తి అవతారంబుల నంది అంతరంగునిగ ఏకాంతర మూర్తియై, ఏక జ్యోతినై<br>అఖిలాండ మూర్తినై, ఆదిపురుషుండనై అణువణువు నిండిన, నీ పుణ్యం పండిన — నీ మనసు పండినా<br>పండింతు మీ జీవితాల శుభాంకంబుగా...! |
| 57. | పుట్టిన పసిగొందు నుండి పుణ్య పురుషుడి వరకు మీ ఆత్మ జ్యోతినై వెల్గు చున్నది ఈ జ్యోతి స్వరూపము<br>నుండి ప్రాణ జ్యోతులై మిము వెల్గించు చున్న ఆ ప్రాణ వాయువున్ నేను వెలిగేటి జ్యోతులన్ నేనే! |
| 58. | కండ్లకు కట్టిన మీ మాయపు తెరలు ఛేదించ, చిన్మయ మూర్తి చిటుక్కున దర్శన మిచ్చు<br>ఛేదించు మాయన్ చేరుము లీలా మానుష విగ్రహుండు చెప్పిన ఈ విభూతి యోగమున్...! |
| 59. | బ్రతుకున్ యాగము చేసి హోమ కుండమునన్ మీ అవగుణంబులన్ ఆహుతి వేయుడీ<br>పద్మ సంభవుడు ప్రత్యేక్షమౌ గాదే..పరమానంద రూపుడవుచున్...! |

| | |
|---|---|
| 60. | సకల భువనంబుల్ నా బుజ్జి బొజ్జన్ నిండన్ అల్లరి చేసితి ననుచు, తన పిల్లడి ననుచు బ్రాంతి కట్టగ వచ్చె రోటికి చుట్టంగ ప్రేమ పాశంబునన్ తప్ప, నే కట్టం బడితినా? నా తల్లికిన్ తప్ప, నే నొప్ప మీ ఎవరి చేతికిన్ చిక్క శక్యమా! పట్టగన్, చుట్టగన్, చూచెదరేమో చూడూడీ ఈ దొంగాటకున్ నన్ పట్టగ నేర్తురేమో...! |

(౯) (26-10; యాభై ఎనిమిదవ రోజు)

| | |
|---|---|
| 61. | నంద నందనుడనే నందార్చిత ఆనంద మూర్తిని, నన్ ఆత్మీయుడంచు నమ్మిన నందనవనము చేతు, అల బృందావన మందు సర్వస్య శరణాగతి అన్న...! |
| 62. | నానా విధ రూప రంగులన్ నొక పగిదిన్ జూసి నొక గాటన్ గట్టి గోవుల కాచినాను నొక మందన్ జేసి జీవిత మందున్ గోవింద పొందున్, ఇచ్చితి మోక్ష కైవల్య మందన్, ముచ్చ గోపాలకు పొందున్...! |
| 63. | అన్యముగా తలప నేటికీ నే నందరి ఆత్మీయుడనే! నన్ అందంగన్ నేర్తురేని నాదగు గుణముల్ మీ అందున్ బహు విధముల కందున్...! |
| 64. | గుణ గణముల్ రూపము లెన్ని వున్న ఆ గోగణమున్ కాచిన గోపాలుడొక్కడే నేనెన్ని విధముల చెప్పినన్ అన్య విధముల అర్థము నొంది పరుడివిగా మిగిలి పోతివే పదే పదే జన్మల నెత్తన్...! |
| 65. | జన్మ రహితున్ పుట్టుక లేని వాడిన్ సర్వులకున్ — సర్వ జగాలకున్ సర్వస్వ మయిన వాడిన్ తత్వదృష్టి కలిగె నేని తరతమ భేదము లేకన్ సర్వము సర్వేశున్ కాంచిన నాడే పరిపూర్ణ జ్ఞానివే...! |
| 66. | నిండు సరసు పగిదిన్ నిశ్చల మతివై నీ మానసమున్ నిజ గుణములన్ నందంగన్.. క్షమ, దయ, సత్య, ఇంద్రియ, మనో నిగ్రహంబుల్, సుఖ దుఃఖముల్, ఉత్పత్తి ప్రణయముల్, భయా భయంబులు, అహింస, సమత్వ, తపస్సు, తృప్తి దానముల్, కీర్తి అపకీర్తుల్ నా యందే నానా గుణముల్ లయ మందెన్, జ్ఞానివై అరయం గలవే...! |
| 67. | ఆదికి అనాది పురుషుడ సప్త ఋషుల్, సనక, సనంద నాదుల్, మనువుల్, స్వాయంభువ మనువుల్ పదునాలుగు మందిన్, నా యందున్ సంకల్ప బలమందెన్ సృష్టిన తనయులకు తనయులైన మీరంతా నాకు అత్యంత ఆత్మీయ బాంధవుల్...! |
| 68. | కనుకన్ పరమేశ్వరుడ నాదగు యోగశక్తిన్ విభూతి యోగమున్ తత్వ సహిత సన్నిధి అందిన నాడే, చలించని యోగమూర్తివై, జ్ఞానమతివై అత్యంత ప్రీతి పాత్రులై భువిన్ వెలయంగ గలరు...! |
| 69. | నేనే నారాయణుండ నానా జగతుల్, నాదగు ఉత్పత్తులే నా అనతి లేక ఈ జగత్తు నిల్చునే ఈ తత్వము తెలిసిన నాడే శ్రద్ధాభక్తుల పరమేశ్వరుడైన నన్ గని పావన మొందెదరు...! |
| 70. | పంచ భూతములకు ఆది భూతుడ నేను... బ్రహ్మలకు బ్రహ్మను, జ్యోతులకు బ్రహ్మాండ జ్యోతిని అష్ట నిధులకున్ కుబేరుకు కుబేరుండ నేను.. దేవతల కెల్ల దేవదేవుండ నేను...! |
| 71. | రాత్రింబగలు నేను, వేదములకు వేద వేదాంగము నేను, పర్వతాగ్రములకున్ హిమగిరి పర్వతము నేను, |

| | |
|---|---|
| | పంచాగ్నిలకున్ అధిపతి అగ్నిన్ నేను, కర్మంబుకున్ ధర్మంబు నేను, ధర్మంబులకున్ ధర్మదేవత నేను, బ్రాహ్మణులకున్ సద్బ్రాహ్మణుడ నేను, గోవులకున్ కామధేనువును నేను, కల్పతరువును నేను, కాలము నేను మృత్యువును నేను, జగతిన్ సృష్టింతు, కడపట ప్రహరింతు, నా నిజ మాయనెవ్వడు తెలుసుకొనంగ లేరు. |
| 72. | నన్నున్ తెలియ గోరిన నాదున్ లీలల్ అరయ గోరినన్ ఈ మాయపు తెరల వీడక నను గాంచగన్ శక్యంబు గాదు పూసలకున్ మణిపూస నైన నా ఊసుల్ నీ కరయంగ నెత్తంగ వలె అరువది జన్మల్...! |
| 73. | వేదాంత చర్చల్, తత్వ జ్ఞానముల్ నీ కాలము ముగించునే గాని — అర్థంబు అరయంగ లేవు వ్యర్థంబేల బ్రతుకు — ప్రార్థించు ఆ శ్రీవిష్ణున్ మీ ప్రారబ్ధ కర్మల్ కరగ దీయున్...! |
| 74. | నాదగు విభూతి యోగమున్ వేదాంత చర్చల్ నీకున్ నూరిపోయ వెర్రికిన్ వెర్రి నైతినే వట వృక్షంబౌ నా నీడన్, ఎప్పటికిన్ నీవొక పిచ్చి మొక్కవే...! |
| 75. | వేదమునకున్ అంతంబొచ్చె నీకేల వేదాంత చర్చల్ వేదానికి ఇది అంతము గాదు నీ బ్రతుకు అంతానికే వచ్చెనేమో వేదాంగముల్...! |
| 76. | కాలమా ఆగదు కాలుడు రాకన్ పోడు ఆ రావి చెట్టు ఆకున్ చివర నిల్చిన బిందువై నీవే క్షణమున్ నేలం రాలుదువో! నీకే తెలియదు అశాశ్వత క్షణముల్...! |
| 77. | తేటన్ తెలుగున చెప్పెద మరి యొక పరి నగదున్ అప్పిచ్చిన మార్వాడి పీక్కొని తిను పిచాచియై — గడించు క్షణముల్ మృత్యుం దేవత నీకిచ్చిన ఆయుష్యు క్షణ, క్షణముల్ అర క్షణమైన విడువక లెక్కించున్ — అప్పిచ్చిన వాని పగిది...! |
| 78. | నీ తరిగెడు ఆయువుల్ — తరలిన్ రావు ముదుసలి తనమునన్ ఆ శ్రీ హరిని తలుతు నని అతి తెలివిన్ జేసెడి నీ ఆలోచనల్ అక్కర కొచ్చునే...! |
| 79. | కాలున్, సేతులున్ కదలవు... కళ్లున్ కన నేరవు : నోరుం మాటన్ లేక పడిపోవుదువు..శ్రీ కాంతున్ కనలేని నీ చివరి ప్రొద్దుల్ కాలుడు కనికరము లేక కాలపాశము వేయన్ నీ జీవితం ప్రేలి పోవునే...! |
| 80. | కనుకన్ నీ జీవితపు పొద్దుల్ వాలక మున్నే ఆ పురుషోత్తము పాదము వీడక పట్టుము గట్టిగ పట్టితి వేని — చేసిన పాపముల్ మరి సేయక పశ్చాత్తాప హృదయుండ వైతి వేని — పాలింతు మిమ్ము పరమ దయతో — నేను ఆ పాలకడలి శయనున్ — శ్రీసాయినాథున్...! |
| 81. | ఎన్నిన్ నీతులు చెప్పిన — నీ కింతేని జ్ఞానమున్నన్ ఏనాడో తరించెడి వాడివే! కుక్కన్ తోకన్ పట్టి ఈదిన ఈ సంసార సాగరంబునన్ కొట్టుకు మునిగి చచ్చెదవు తరలి రావు ఈ క్షణముల్...! |

(6) (27-10; యాభై తొమ్మిదవ రోజు)

| | |
|---|---|
| 82. | అల ఆలమందన్ గాచిన నంద నందనుని పాలించ భక్త జనములన్, పడివస్తి మరల మిము భక్తుల సేయగన్.! |
| 83. | పరిహాసము కాదిది.. ఆ పరమాత్మన్ గన పరితపింతు వేమి..పరి పరి విధముల పోనేల? |

| | |
|---|---|
| | పదిలముగ నీ మనసు నంటి... పరికింపగన్ భక్తులన్ దరిజేర్చు కొనంగ.. ఆరాటము నందితి నెంతో...! |
| 84. | పొందగ లేక తర తరముల్ తరలి తరలించి తరలి పోయిన భక్తులకై తపించి తపించి<br>భవతరణిన్ దాటించ తరలి వస్తి ఈ సాయి తనువునన్...! |
| 85. | భక్తుడు భగవంతున్ జేర తపించు ఏ క్షణముల్, ఆనాడు భగవంతుడు భక్తుని జేర తరలివచ్చు తరుణం<br>ఈనాడు, నా నాడిని పట్టితివేని నర నరమున, పలుకు "భక్తాగ్రణి" అనుచున్...! |
| 86. | తింటున్, త్రాగుతు, నడచుచూ, శయనించుచూ, పిల్చుచున్, పలుకుచున్, మీ నిత్య కృత్యముల్ సల్పుచున్,<br>నాదగు నామంబు నీ మనంబున తలచితిరేని తరలింతు మిమ్ము...తరలిరాని మరు జన్మల్ లేక...! |
| 87. | జనించు నందాక నీ తనువున్ లేదు మరణించు వెనుకన్ తనువు నీ వెంట లేదు<br>మధ్య గాఢ నిద్ర వచ్చు — కలల గని నొచ్చెదవేమి? |
| 88. | కలత పడెద వేల, కలలకై కన్నీరు పెట్టిన కనులిప్పిన కల కలగా కలిసి పోవునే<br>మధ్యనే వచ్చు కల నీ జీవితము! |
| 89. | అశాశ్వత బ్రతుకుల్ కల్లంచు అది కల గాంచితి నంచున్ ఆత్మ జ్ఞానివై, నీవు ఆత్మవై<br>(శాశ్వత మా నారాయణున్ నందగన్) పరమాత్మన్ పొందు.. నిజధామంబు అందే...! |
| 90. | పూతన విషపు పూతల పాల ధారలు అప్యాయము నన్ చంపంగ నివ్వ<br>ఆనందము నే గ్రోలితిన్ ఆ విషంబైన అమృత మనుచున్...! |
| 91. | పూతన్ జచ్చెనే పరమ రోత పర్వతాకారమున్ చంపెదనని తానొచ్చి, జచ్చె నా చేతన్ ...! |
| 92. | ఆ విషపు పూతల క్షీరమున్ పరమాన్నపు పగిది నే గ్రోలి ఆరగించి, అరగించితిన్, ఆనందంబునే<br>పరమ కంటకులౌ, ఆ రక్కసుల దునుమాడి లోక కళ్యాణమున్ సేయ నెంచి నందునే...! |
| 93. | ఈ నాడున్ మీ నరుల్ పరమాన్నము పెట్టినన్, మీ అవగుణముల్ తలచి<br>పయోముఖ విష పాలధారలై ప్రతి క్షణముల్ మీ నివేదనల్ భరించలేక నరుడా నీకు నమస్కరించితిన్...! |
| 94. | నిహతులైరి నా చేత రక్కసుల్ పరము నొంది, పరమాత్మ స్వరూపులైరి, నరుల జన్మలన్ నొంది<br>అసురులై ఈనాడున్ నానా ఘోర కృత్యముల్ సల్ప, అవురా, సహించ లేకుంటినే...! |
| 95. | ఎపుడు, ఎక్కడ, ఏ యుగ మందైనన్ పాపముల్ పండి ధర్మముల్ నశింప<br>నా సృష్టికి ముప్పున్ వాటిల్ల సేయగ చప్పున వత్తు పాప కర్మలన్ పరిమార్చన్...! |
| 96. | పండైనన్, ఫలమైనను పండనిదే పడున నేల ఏ నాడైనన్!<br>పండవలె మీదు పాపముల్ పరిమార్చ నొత్తు, రానున్నది ఆ రోజు తొందరలోనే...! |
| 97. | చెప్పితి నీ దనుకన్ చెప్పిన సుద్దులు చెప్పకన్ ముద్దుల తనయా! వొద్దికన్ నీ జీవితపు పొద్దుల్ దిద్దన్...! |
| 98. | ఆ పురుషోత్తమున్ పుణ్య సూక్తులన్ పుడమిన పడిన నాటి నుండి నే కూరిమి రంగరించి<br>ప్రొద్దు ప్రొద్దులన్ పోసితి, నీ ఒకింత పుణ్యం అందితివేని కర్మల కరిగి పురుషోత్తమున్ అందెడి వాడివే...! |

| | |
|---|---|
| 99. | చిత్రమిది ఎన్ని రీతుల చిన్మయ రూపుని మది నిల్ప లేకుండుటన్ చిత్ర పటమైననూ నీ ముందుంచిన కొన్ని క్షణముల్, చిత్తమునకు హత్తు కొనంగ వచ్చు నంచున్...! |
| 100. | నాకు, నా ఛాయ రూపంబైన నా చిత్ర పటమునకు తేడాలు లేవు, నీ చిత్తము మెచ్చునందాక నే వచ్చితి నీ ఎదురు అనుచు ఎంచి భజించు, పూజించు పుణ్యము కల్గున్...! |
| 101. | సత్యంబుగ చెప్పెద..ఏ ఒక్క రూపు గాదు నేన్ నిత్యము అలరారెద సర్వ ప్రాణుల నా ఇచ్ఛన్ నా శక్తి మీ అందరి రూపంబుల సర్వరూపులై అలరారెద...! |
| 102. | రూపము లేని నన్ను ఏ రూపున్ భజింతు వంచు, వాపోయేటి, నిన్నుగని రూపము నిచ్చితి, నీ హృదయం రూపు హత్తు కొందుదాక...! |
| 103. | సరిహద్దులు లేవు నాకు.. మీ మనసు సరిదిద్దన్ నే పాత్రల నా శక్తిన్ ఏ పగిది నీరు పోసినన్ ఆ రూపు నీకు తోచు నా శక్తికి కొలత ఉన్నదే...! |
| 104. | భక్తిన పండి శక్తిని అందితివేని బ్రహ్మ తత్వంబై, బ్రహ్మాండమంత బ్రహ్మ తోచున్ దక్షత చెప్పితి నీకున్ పెద్ద దక్షతనై నిలిచి దక్ష ప్రజాపతులకున్ రక్షిత రక్షకుండ, దక్షతన్ నేనైతి దర్శించ నిజమున్, దక్షత చెప్పితి నేనొచ్చితి దయ గల దత్తాత్రేయుండనై...! |
| 105. | దయ గల గురువు అత్రి అనసూయల ముద్దుం తనయుడు త్రిమూర్తి అంశలన్ త్రిగుణములన్ తనయందొక్కటి చేసెన్...! |
| 106. | లోకముల నుద్ధరించి లోక, లోకాలకున్ గురువులకు గురువై, సద్గురువై గురు బోధనల్ సేయ అలించన్ జ్ఞానత మీలో లోపించ అజ్ఞానంబునన్ మునిగిన నీ అసమర్థతల్ గని విసిగినన్ మరలి వచ్చె పొరలిన దయతో దత్తపంచక మౌచున్...! |
| 107. | శ్రీపాద శ్రీవల్లభులై — జగముల్ సుశీల నింప సుధ్బోధనల్ చేసె, తన శక్తిన్ పంచిన్..నూటికి, కోటికి తరించిరే ఏ పదిమందో ఔరా! దున్న జడివాన జడవక నిల్చుకాని, సద్గురు బోధనల్ మెచ్చునే...! |
| 108. | నరుల, అసుర గుణములు అంతర్హితము చేయ నాడొచ్చె నరసింహ సరస్వతి 'నరహరి' అవుచున్ అతని సద్బోధనల్ అంద నరుల్ తరించుట ఏ నలుబది మందో...! |
| 109. | విసిగి వేసారినన్ తనయులకు తనయులంచు ప్రేమల రాశి రాజ్యముల్ లేని అక్కల్ కోట మహారాజునై అక్కర కొద్ది మీ ముందుకు వచ్చితి, అంధులై అజ్ఞానతన్ అలరారుదురే! ఆలోచించుడీ...! |
| 110. | చిక్కగ భక్తిన్, చక్కగ నవవిధ భక్తి మార్గముల చిక్కని పాల చక్కర వేసి మీ చేతికి చిక్క నిచ్చినన్ చక్కగ ద్రావ నేర్వక గ్రక్కున ఉమ్మి విమర్శల్ చేసినా మీ బ్రతుకుల్ సరిదిద్దుటకే...! |
| 111. | మరలి వచ్చితి, మణులకు మణినై, మాణిక్య ప్రభువునై — మరి కొందరిని మణిమయ మాలలో పూసల్ చేయ తరించిరి తగు మార్గమే! |
| 112. | తరచి తరచినన్, తరలిన వారు కొందరే తరించితిరే! తరగని మీ అజ్ఞానతలకున్ |

| | |
|---|---|
| | తరగని విజ్ఞత పంచన్ తరలి వచ్చితి, భువికిన్ మమతలు నింప సాయి మాతనై...! |
| 113. | రూపున్ లేని నేను రూపంచున్, రూపముల నెత్తినది మీ మొద్దుల మహిష జన్మంబులకున్<br>మదిన హద్దు కొనంగ ఎదుట నిలిచితి నరులన్ కలసి చేసి చెప్పి, చూపించుటకే...! |
| 114. | మనసున్ నిల్ప, ఇచ్చిన మరియొక అవకాశంబిది ఆకాశమంటే నా తత్త్వమునకున్ అవధులు లేవు<br>అవధిని కల్పించ నొక తరంగమై ఆ కడలిన్ వదిలి, కదిలితి లోకుల పాపము త్రుంచన్..! |
| 115. | పాల కడలిని కదలక ఏ వేళలన్ జలశాయియై నా సశ్వరూపంబు నాడక్కడే నిద్రించు ఏ వేళలను నా<br>యోగమున్, సంకల్పమున, నాదగు లీలల్ చూపగ వచ్చిన కళలే ఇవి సుమా...! |
| 116. | నే నందరి వాడనే ఆనంద నందనందనునే అందించెద నన్ను అర్థించితి వేని<br>ఆనంద రూపునై పూరించెద నీ పుణ్యమున్న మురళీ రవముల్....! |
| 117. | అవధూతలన్, ముముక్షువులన్, గోవులన్, బ్రాహ్మణులన్, యజ్ఞ యాగములన్, జలమున్,<br>అగ్నిన్, ఆకాశమున్, అన్నిటన్ నా శక్తిం అర్చించన్ అందుదువు — నారాయణ రూపమున్ ..! |
| 118. | అడుగడుగునన్ నాదగు శక్తిన్ సమకాలికులన్ వేలకు వేలు యందున్ ముక్తుల్ చేయ<br>వేలెత్తి చూపన్, నూటికి పది మందికిన్ శక్తుల్ పరిమితి చేసి పంచితిన్....! |
| 119. | పరిగ్రహించి పరిపూర్ణుడ అవుదునంచున్ పరి పరి విధముల నే పరి తపించుచున్<br>చేసిన పాపముల్ నే తెలియ జెప్పినన్.. పదే, పదే పాపపు ఖర్మల పొరలి జన్మ నెత్తి బహు దూరంబైతివే....! |
| 120. | పశ్చాత్తాప హృదయంబున చేసిన తప్పులు సేయక యుంటి వేని పాలకడలిన్ వదిలి,<br>నీ హృదయ తరంగమై పునాదిని చేర్తు పునర్జన్మల్ లేకుండగన్....! |
| 121. | నిక్కము చెప్పెద నొక్క సత్యము ఆత్మీయతన్ అందిన.. నే అందరి వాడనే, అందరి లోన నే అత్మేశ్వరుడనే<br>అందరు నాయందు కలరు....! |
| 122. | ఈ సత్యము తెలియక అలమటింతురే నరుల్ అందాకన్ కాలచక్రములన్ నలిగి పదే, పదే<br>జన్మల నెత్తుతు నుండరే..ఏ నాటికైన జ్ఞాన మూర్తులై తండ్రిన్ జేరవచ్చు తనయు లటంచున్ ఆ లోకమునన్,<br>మీ రాకకై నిరీక్షింతు, అజ్ఞానత బాపి మీ సాయి దేవుండ....! |